సంపుటి :02 సంచిక :290 పేజీలు :06
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
మంగళవారం 27, జనవరి 2026

# అమ్మ పిలుపు వినకుండానే.. అనంత లోకాలకు!

- పుట్టకముందే తల్లితో పాటు కన్నుమూసిన పసికందు
- గర్భిణీ వైద్యురాలిని బలితీసుకున్న లారీ వేగం

05




మరో నాలుగు రోజుల్లో ఆ ఇంట్లో పసిబిడ్డ కేరింతలు వినిపించాలి.. తొమ్మిది నెలల నిరీక్షణకు ప్రతిఫలంగా ఆ తల్లి ముఖంలో చిరునవ్వు చిందించాలి.. కానీ విధి ఆడిన వింత నాటకంలో గర్భిణీ డాక్టర్ మమత (33) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. హన్మకొండ హంటర్ రోడులో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘోర ప్రమాదం ప్రతి ఒక్కరినీ కన్నీటి పర్యంతం చేసింది.



## నాణ్యమైన విద్యే లక్ష్యం...

- యంగ్ ఇండియా స్కూలుకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

05



# మోగిన ఎన్నికల నగారా

## మున్సిపల్ ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. పదవీ కాలం ముగిసిన మున్సిపాలిటీలతో పాటు కొత్తగా ఏర్పడిన పురపాలక సంఘాల్లోనూ ఎన్నికలు జరగునున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ రాణి కుముదిని వివరాలు వెల్లడించారు. నోటిఫికేషన్ విడుదలైన మరుక్షణం నుంచే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలవుతుందని స్పష్టం చేశారు. బుధవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. రిటర్నింగ్ అధికారులు వార్డుల వారీగా రిజర్వేషన్ల వివరాలతో కూడిన ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. ఇదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను కూడా అదే రోజు ప్రదర్శిస్తారు. నామినేషన్లు దాఖలు చేయడానికి జనవరి 30వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు గడువు ఉంటుంది.

- అక్షరదర్బార్, హైదరాబాద్

- రేపటి నుంచే నామినేషన్ల స్వీకరణ
- 30వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ
- 31న నామినేషన్ల పరిశీలన.. 3వ తేదీ ఉపసంహరణ గడువు
- 11న పోలింగ్.. 13న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- వివరాలు వెల్లడించిన ఎస్ఈసీ రాణికుముదిని
- అమల్లోకి వచ్చిన ఎలక్షన్ కోడ్
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 మున్సిపాలిటీలు

05



## బీఆర్ఎస్ లో అరూరి జోష్

- కమలం వీడిన రమేష్ కారు ఎక్కేందుకు రెడీ
- రేపు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికకు నిర్ణయం
- ఆయనతో పాటు గులాబీ కండువా కప్పుకొనున్న కొందరు కార్పొరేటర్లు, అనుచరులు
- ఉమ్మడి జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణలు
- మున్సిపల్ ఎన్నికల వేళ బీజేపీకి గట్టి షాక్

02

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల వేళ బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సోమవారం నాడు బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు పంపించారు. ఆరూరి రమేష్ తన సొంత పార్టీ అయిన బీఆర్ఎస్ లో చేరబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 2024 మార్చిలో బీజేపీలో చేరిన ఆయన, దాదాపు రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ గులాబీ గూటికి చేరుతుండటం ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడిని పెంచింది.

– అక్షరదర్బార్, వర్ధన్నపేట

## అడవి తల్లి పొత్తిళ్లలో వన దేవతల కొలువు






- రేపటి నుంచి మేడారం సమ్మక్క- సారక్క మహాజాతర
- భళా అనేలా.. దక్షిణాది కుంభమేళా
- కన్నెపల్లి నుంచి సారలమ్మ రాక
- రెండో రోజు సమ్మక్క కూడా గద్దెలపైకి
- 31న అమ్మవార్ల వనప్రవేశం

02



## గన్ మిస్ ఫైర్

- ఇద్దరు జవాన్లకు గాయాలు
- తుపాకీని శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదం
- వాజేడు సీఆర్‌పీఎఫ్ క్యాంపులో ఘటన

03



# అడవి తల్లి పొత్తిళ్లలో
# వన దేవతల కొలువు

- రేపటి నుంచి మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర
- భళా అనేలా.. దక్షిణాది కుంభమేళా
- కన్నెపల్లి నుంచి సారలమ్మ రాక
- రెండో రోజు సమ్మక్క కూడా గద్దెలపైకి
- 31న అమ్మవార్ల వనప్రవేశం
- వనదేవతలను దర్శించుకునేందుకు మేడారం చేరుకుంటున్న భక్తులు
- భక్తుల కోసం 4 వేల బస్సులను నడపనున్న ఆర్టీసీ
- పార్కింగ్ స్థలాలు, తాత్కాలిక వైద్య శిబిరాలు రెడీ
- 13 వేల మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు

**అక్షరదర్బార్, మేడారం:**

మేడారంలో బుధవారం కన్నెపల్లి నుంచి సారలమ్మ గద్దెపైకి చేరుకోవడంతో మహాజాతర మొదలవుతుంది. 29న గురువారం చిలుకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని కుంకుమ భరిణె రూపంలో పూజారులు తీసుకువస్తారు. ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ గాలిలోకి కాల్పులు జరిపి అమ్మవారికి స్వాగతం పలికే ఈ ఘట్టం జాతరలోనే అత్యంత ఉద్వేగభరితంగా సాగుతుంది. శుక్రవారం తల్లీకూతుళ్లు ఇరువురు గద్దెలపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఈ రోజు భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. శనివారం సాయంత్రం వనదేవతలు తిరిగి వన ప్రవేశం చేయడంతో ఈ మహా క్రతువు అధికారికంగా ముగుస్తుంది. తొలిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవతను గిరిజన పూజారులు సంప్రదాయబద్ధంగా తీసుకువస్తారు. పసుపు, కుంకుమ, వెదురు బుట్టలతో కూడిన అమ్మవారి రూపం జనసంద్రం మధ్య గద్దెలపైకి చేరుకుంటుంది. ఇదే సమయంలో మహబూబాబాద్ జిల్లా నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు పెళ్లికొడుకులా ముస్తాబై పూనుగొండ్ల నుంచి మేడారానికి చేరుకుంటారు. ఏటూరునాగారం ప్రాంతం నుంచి గోవిందరాజులు కూడా మేడారం గద్దెపై కొలువు దీరుతారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో మేడారం పరిసరాలు మార్మోగుతాయి. భక్తులు దారి పొడవునా ఎదురుచూస్తూ అమ్మవార్లకు నీరాజనాలు అర్పిస్తారు. కన్నెపల్లి నుంచి మేడారం గద్దెల వరకు సాగే ఈ ఊరేగింపు భక్తుల్లో ఉత్సాహాన్ని నింపుతుంది. అంతకు ముందే మంగళవారం రాత్రి జంపన్నను గద్దెకు తీసుకురావడంతో జాతర వాతావరణం పతాక స్థాయికి చేరుతుంది.

## - పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ

భక్తుల వాహనాల కోసం ప్రభుత్వం ఈసారి రికార్డు స్థాయిలో ఏర్పాట్లు చేసింది. సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో 33 చోట్ల దాదాపు మూడు లక్షల వాహనాలు నిలిపేలా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వన్ వే నిబంధనలను పోలీసులు కఠినంగా అమలు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగిస్తూ యాప్ ద్వారా ట్రాఫిక్ చిక్కులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వాహనదారులు పోలీసుల సూచనల మేరకు కేటాయించిన స్థలాల్లోనే వాహనాలను నిలపాలి. రోడ్లపై ఎక్కడా వాహనాలు ఆపకూడదు. ఓవర్ టేక్ చేయడం వల్ల పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలి.

## - కట్టుదిట్టమైన బందోబస్తు

జాతర ప్రశాంతంగా సాగేందుకు పోలీసు శాఖ అత్యంత భారీ నిఘాను ఏర్పాటు చేసింది. దాదాపు 15 వేల మంది సిబ్బంది వివిధ షిఫ్టుల్లో నిరంతరం విధుల్లో ఉంటారు. అత్యాధునిక ఏఐ డ్రోన్ల ద్వారా అటవీ ప్రాంతంలోని ప్రతి కదలికను పర్యవేక్షిస్తున్నారు. తప్పిపోయే అవకాశం ఉన్న పిల్లలు, వృద్ధులకు క్యూఆర్ కోడ్ ద్వారా జీపీఆర్ఎస్‌ను అనుసంధానం చేసి ఇట్టే గుర్తించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నేషన్ సాఫ్ట్‌వేర్‌తో దొంగలను పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. శాంతిభద్రతల పరిరక్షణ కోసం మేడారం చుట్టూ 31 ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశారు. ఎస్పీ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

## - శాఖల వారీగా సమన్వయం

ఈ మహాజాతరను విజయవంతం చేసేందుకు 21 ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. పారిశుధ్యం మెరుగుపరచడం కోసం 5 వేల మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ 30కి పైగా తాత్కాలిక వైద్య శిబిరాలను సిద్ధం చేసింది. ఆర్టీసీ సుమారు 4 వేల ప్రత్యేక బస్సులను నడుపుతూ రాష్ట్రవ్యాప్తంగా భక్తులను సురక్షితంగా మేడారానికి చేరుస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం వర్తింపజేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యేక గ్రిడ్లను ఏర్పాటు చేశారు. అగ్నిమాపక శాఖ శకటాలతో సిద్ధంగా ఉంది. రెవెన్యూ మరియు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు భక్తులకు కనీస వసతులు కల్పించేలా పర్యవేక్షణ చేస్తున్నారు. జంపన్న వాగు వద్ద ఘాట్లను ఆధునీకరించి 350 మంది ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

## - భక్తులకు సూచనలు

జాతరకు వచ్చే భక్తులు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు ఎక్కువగా తీసుకోవాలి. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీపంలోని వైద్య శిబిరాలను సంప్రదించాలి. జంపన్న వాగులో స్నానాలు చేసే సమయంలో లోతైన ప్రాంతాలకు వెళ్లకూడదు. ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించి అడవిని పరిశుభ్రంగా ఉంచాలి. చిన్నారులు, వృద్ధుల జేబుల్లో పేరు, ఫోన్ నంబర్లు ఉన్న చీటీలను ఉంచడం వల్ల వారు తప్పిపోతే గుర్తించడం సులభం అవుతుంది. అడవి ప్రాంతం కాబట్టి అగ్ని ప్రమాదాలు జరగకుండా వంటలు చేసేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలి.

## - రోడ్ల విస్తరణ, ప్రయాణ సౌలభ్యం

మేడారం జాతరకు వచ్చే వాహనాల రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం రోడ్ల విస్తరణకు ప్రాధాన్యమిచ్చింది. సుమారు రూ.100 కోట్లు వెచ్చించి 39 ప్రధాన రహదారులను అభివృద్ధి చేశారు. 10 రోడ్లు, మూడు కల్వర్టులను కొత్తగా నిర్మించడంతో ప్రయాణ సౌలభ్యం ఏర్పడింది. గద్దెల ప్రాంగణంలో తోపులాటకు ఆస్కారం లేకుండా క్యూలైన్లను వెడల్పుగా శాశ్వత ప్రాతిపదికన నిర్మించారు. ప్రాకారం విస్తరణ పనుల వల్ల ఏకకాలంలో దాదాపు 10 వేల మంది దర్శించుకొనే వెసులుబాటు కలిగింది. భక్తులు తమ బరువుకు సమానమైన నిలువెత్తు బంగారాన్ని (బెల్లాన్ని) సమర్పించుకోవడానికి కూడా తగిన ఏర్పాట్లు చేశారు.






# బీఆర్ఎస్ లో
# అరూరి జోష్

- కమలం వీడిన రమేష్ కారు ఎక్కేందుకు రెడీ
- రేపు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరికకు నిర్ణయం
- ఆయనతో పాటు గులాబీ కండువా కప్పుకొనున్న కొందరు కార్పొరేటర్లు, అనుచరులు
- ఉమ్మడి జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణలు
- మున్సిపల్ ఎన్నికల వేళ బీజేపీకి గట్టి షాక్

**అక్షరదర్బార్, వర్ధన్నపేట:**

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల వేళ బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సోమవారం నాడు బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు పంపించారు. ఆరూరి రమేష్ తన సొంత పార్టీ అయిన బీఆర్ఎస్ లో చేరబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 2024 మార్చిలో బీజేపీలో చేరిన ఆయన, దాదాపు రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ గులాబీ గూటికి చేరుతుండటం ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడిని పెంచింది.

## - మారనున్న సమీకరణలు

ఆరూరి రమేష్ రాకతో వరంగల్ మున్సిపల్ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బుధవారం ఆయన తన అనుచరులు, అభిమానులు, భారీ సంఖ్యలో కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకోనున్నారు. అంతకంటే ముందు ఆరూరి రమేష్ కేసీఆర్ ను కలుస్తారని తెలిసింది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరుణంలో ఈ చేరిక చోటుచేసుకోవడం గమనార్హం. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) తో పాటు వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలపై పట్టు సాధించడమే లక్ష్యంగా అరూరి రమేష్ ఇప్పటికే తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. తన రాకతో పార్టీని వీడిన పలువురు కార్పొరేటర్లు, కీలక నేతలు తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## - గులాబీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం

ఆరూరి రమేష్ రీఎంట్రీతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నది. తెలంగాణ ఉద్యమ కాలం నుండి పార్టీలో పనిచేసిన ఆయనకు జిల్లాలో బలమైన కేడర్ ఉంది. ఈ ప్రభావాన్ని ఉపయోగించుకుని మున్సిపల్ ఎన్నికల్లో కారు పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ రిజర్వ్డ్ వార్డులు, నియోజకవర్గ కేంద్రాల్లో అరూరి పట్టు ఎన్నికల ఫలితాలను తలకిందులు చేయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం అటు బీజేపీకి నష్టం చేకూర్చడమే కాకుండా, అధికార పార్టీకి కూడా గట్టి పోటీ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

# యువతి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్లు జైలు శిక్ష

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి :యువతిని మానసికంగా వేధించి ఆమె మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సబ్ కోర్టు న్యాయమూర్తి ఏ. నాగరాజు మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే, మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన జోరుక రాజేశ్వరి కుమార్తె రవళి (20)ని అదే గ్రామానికి చెందిన గాదం ఐలయ్య (40) అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధించాడు. 2019 డిసెంబర్ 10న రాజేశ్వరి ఇంటికి వచ్చి, భూమి రాసిస్తానని చెప్పి రవళిని పెళ్లి చేసుకోవాలంటూ వ్యంగ్యంగా మాట్లాడినట్లు అభియోగాలు నమోదయ్యాయి. అప్పటికే ఐలయ్యకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన రవళి, డిసెంబర్ 11న ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించగా, చికిత్స పొందుతూ చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మహేంద్ర కుమార్ ఐపీసీ సెక్షన్ 306 కింద కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న కోర్టు నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. ఈ కేసులో ప్రభుత్వ తరపున పీపీ రఫీ వాదనలు వినిపించగా, సాక్షులను కోర్టు పీసీ శ్వేత ప్రవేశపెట్టారు. పోలీసు అధికారులను చిట్యాల సీఐ మల్లేష్, డీఎస్పీ సంపత్ రావు, ఎస్పీ సిరిశెట్టి సంకీర్తి అభినందించారు.



# మేడారం ఆలయంలో క్యూలైన్లు ప్రారంభం

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: మేడారం సమ్మక్క సారలమ్మ జాతర దర్శనానికి పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సుమారు 3 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన క్యూ లైన్లు , షెడ్లు ప్రారంభించిన రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి ,మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# తల్లిదండ్రుల గౌరవాన్ని పెంపొందించాలి

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి : విద్యార్థులు మంచి చదువులు చదివి తల్లిదండ్రుల గౌరవాన్ని పెంపొందించాలని రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా బండారుపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# గన్ మిస్ ఫైర్

- ఇద్దరు జవాన్లకు గాయాలు
- తుపాకీని శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదం
- వాజేడు సీఆర్పీఎఫ్ క్యాంపులో ఘటన

అక్షరదర్బార్, వాజేడు : ములుగు జిల్లా వాజేడు సీఆర్‌పీఎఫ్ క్యాంపులో తుపాకీ శుభ్రం చేస్తున్న క్రమంలో అది మిస్ ఫైర్ అయి ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒక జవాన్ 'యూజీబీఎల్' అనే అత్యాధునిక రకం గన్‌ను శుభ్రం చేస్తుండగా మిస్ ఫైర్ అయింది. ఘటనలో బుల్లెట్లు దూసుకెళ్లి ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి సిబ్బంది అప్రమత్తమై క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ములుగు జిల్లా ఆసుపత్రికి తరలించారు. సాంకేతిక లోపం వల్ల ఈ ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.





# కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

**–మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి : మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే ఎన్నికల ప్రధాన అజెండాగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ చైర్మన్ సోదకు సన్మానం



అక్షర దర్బార్,పరకాల: లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ కమిటీ సభ్యులు, చైర్మన్ నరేంద్ర ఫరక్ నేతృత్వంలో పరకాల మున్సిపాలిటీ మాజీ చైర్మన్, లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు సోద అనిత రామకృష్ణ ను లయన్స్ క్లబ్ పట్ల వారు అందించిన సేవలను గుర్తిస్తూ హనుమకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల పట్ల సోదా అనిత రామకృష్ణ కృషి అభినందనీయమని కమిటీ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ సభ్యులు సంజయ్ సింగ్, హాలో కుమార్ జా, వివేకానంద జా, విజన్, దేవేందర్ సింగ్, నవీన్ చా, రాజేష్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాలలో మేడారం బస్సు పాయింట్ ప్రారంభం

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రం నుంచి మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు భక్తులను తరలించేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మంగళవారం ప్రత్యేక బస్సు పాయింట్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్ ప్రసాద్ చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ వార్డు సభ్యులు తౌటం నవీన్, వేల్పుల లక్ష్మి, బొల్లా చందు, శనిగరపు మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

# నవాబుపేట మీదుగా టేకుమట్లకు బస్సులు నడిపించాలి



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం నవాబుపేట గ్రామం మీదుగా టేకుమట్ల మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సులు నడిపించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని బీజేపీ సీనియర్ నాయకుడు చెక్క నరసయ్య డిమాండ్ చేశారు. పరకాల ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ రామ్ ప్రసాద్ చిట్యాలకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో మొగుళ్లపల్లి–నవాబుపేట మీదుగా టేకుమట్ల వరకు బస్సు నడిచేదని, రోడ్డు దెబ్బతిన్న కారణంగా రెండు సంవత్సరాల క్రితం రద్దు చేశారని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, కాబట్టి మళ్లీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సర్వ శరత్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తిపాక వాసికి 'గురు రత్న' అవార్డు



అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన మునిగాల రాజు విద్యారంగంలో అందించిన విశిష్ట సేవలకు గాను ఆంధ్రప్రదేశ్–తెలంగాణ 'గురు రత్న–2026' ఉత్తమ యువ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గత పదేళ్లుగా ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ, ప్రస్తుతం హనుమకొండలోని రెసొనెన్స్ జూనియర్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్నారు. చెన్నైలోని ఏఎంఈటీ యూనివర్సిటీ మరియు డా. రామచంద్రన్ మెరిటైమ్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రకటించిన ఈ అవార్డును ఆదివారం ఏఎంఈటీ యూనివర్సిటీ శ్రీ జానకీరామన్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యవస్థాపకులు డా. జె. రామచంద్రన్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా రాజుకు ఫ్రేమ్ చేసిన సర్టిఫికెట్, పతకం మరియు నగదు బహుమతి అందజేశారు. ఈ గౌరవం అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హై స్కూల్ (కేహెచ్ఎస్)లో ఎస్ఎస్‌సీ 2013–2014 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని క్యాతం భవాని ఎంబీబీఎస్ పూర్తి చేసి రేడియాలజిస్ట్‌గా సేవలందిస్తున్న సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. అలాగే చిట్యాల గ్రామపంచాయతీ నాలుగో వార్డు సభ్యుడు తౌటం నవీన్ను కూడా శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ ఎండి రాజ్ మహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కమిషనర్ గారు పట్టించుకోండి

- కాలనీని పొగమయం చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది
- సాయి నగర్ లో శ్వాసకోస సమస్యలతో అల్లాడుతున్న ప్రజలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణ మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యంతో కాలనీవాసులు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని సాయి నగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సాయి నగర్ కాలనీ, పద్మశాలి భవన్ మూలమలుపు వద్ద ప్రతినిత్యం చెత్త చెదారాన్ని ఉదయం పారిశుద్ధ కార్మికులు కాల్చివేయడంతో కాలనీ మొత్తం పొగతో నిండిపోతోందని వాపోతున్నారు. చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుతూనే ఉండటంతో పరిసర ప్రాంతాల్లో తిరగడానికే భయపడుతున్నామని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర కాలుష్యానికి గురవుతూ శ్వాసకోస ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పొగ కారణంగా ప్రతిరోజూ ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని మున్సిపాలిటీ కమిషనర్ పట్టించుకోని చెత్తను అక్కడి నుంచి తరలించారని కోరుతున్నారు. చెత్తను కాల్చి వేయకుండా శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలని కాలనీవాసులు మున్సిపాలిటీ అధికారులను వేడుకుంటున్నారు.




## జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

అక్షర దర్బార్, దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)కి చెందిన 10వ తరగతి విద్యార్థిని వి. కీర్తన జాతీయ సాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు గురుకుల ప్రత్యేక అధికారి మంజుల తెలిపారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైంది. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో కీర్తన పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మంజుల, జీసీడీఓ ఫ్లోరెన్స్, పీఈటీ లావణ్య, గ్రామ సర్పంచ్ రాధిక చందుతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

# సిట్ విచారణకు మాజీ ఎంపీ సంతోష్

- ఫోన్ ట్యాపింగ్ లో ఆయన ప్రమేయంపై ప్రశ్నలు
- సుమారు 5 గంటల పాటు విచారణ
- తర్వాతి నోటీసులు ఎవరికి? అన్న అంశంపై ఉత్కంఠ
- జాగృతి అధ్యక్షురాలు కవితకు నోటీసులు వస్తాయని ప్రచారం

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో భాగంగా మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావు మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో అధికారులు ఆయన్ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. పోలీసుల ప్రశ్నలకు ఆయన పూర్తిస్థాయిలో సహకరించారని సమాచారం. మధ్యాహ్నం 3 గంటలకు హాజరైన సంతోశ్‌ను సిట్ అధికారులు సుమారు 5 గంటల పాటు విచారించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయనకు ఉన్న సమాచారంపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావును సిట్ అధికారులు విచారించిన సంగతి తెలిసిందే. కేసీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన సంతోష్ రావును విచారించడంతో ఈ కేసు మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు వేగం పుంజుకోవడంతో తదుపరి విచారణ ఎవరిపై ఉంటుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. మరో రెండు రోజుల్లో జాగృతి అధ్యక్షురాలు కవితకూ సిట్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.



## కేసీఆర్ పాలనలో
# అన్ని వర్గాలకు న్యాయం

- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు మద్దతు ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

అక్షర దర్బార్, భూపాలపల్లి : కేసీఆర్ ఉన్నంత కాలం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు కృష్ణా కాలనీలో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలనీలో ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. కాలనీలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, చెత్త పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తున్నా అధికారులకు పట్టడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లి ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా కాలనీకి ప్రత్యేక జీవో ద్వారా భూములు ఇప్పించి, ప్రభుత్వ ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగు నీరు అందించడంతో పాటు అదనంగా బోర్లు వేసి నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించామని తెలిపారు. కాలనీ భూములు అన్యాక్రాంతం కాకుండా ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 26 నెలల్లో ఒక్క రూపాయి నిధులు కూడా రాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫలకాలను తొలగించి, తమ బొమ్మలతో కొత్త శిలాఫలకాలు వేయడమే తప్ప అభివృద్ధి లేదని ఆరోపించారు. ఎన్నికలు దగ్గరపడితేనే మంత్రులు భూపాలపల్లికి వస్తున్నారని, ప్రజలు మాయ మాటలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# నాణ్యమైన విద్యే లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- యంగ్ ఇండియా స్కూల్ కు శంకుస్థాపన



అక్షర దర్బార్, పరకాల : ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పరకాల పట్టణంలోని రాజుపేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు కులమతాలకు అతీతంగా ఈ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేయవచ్చని చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వసతులతో కూడిన పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్లే గ్రౌండ్లు, క్రీడా సదుపాయాలతో విద్యార్థుల సర్వాంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## విద్యాసంస్థలకు మేడారం సెలవులు ప్రకటించాలి



అక్షర దర్బార్, శాయంపేట : మేడారం మహా జాతర–2026 రేపటి నుంచి నాలుగు రోజులపాటు జరగనున్న నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా జాతరకు వెళ్లనున్నందున ఈ నెల 28, 29, 30, 31 తేదీల్లో సెలవులు ప్రకటించాలని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు.



## అక్షర దర్బార్ క్యాలెండర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి:ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న అక్షర దర్బార్ నూతన క్యాలెండర్ ని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం బాదం ప్రవీణ్ మాట్లాడుతూ ప్రారంభించిన అనతి కాలంలోనే డిజిటల్ రంగంలో ముందుకు పోతూ ఎన్నో సమకాలీన సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ప్రచురించడం ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అక్కల రఘోత్తం తో పాటు, అక్షర దర్బార్ ములుగు జిల్లా ప్రతినిధి కంచర్ల రాజు పాల్గొన్నారు

# మోగిన ఎన్నికల నగారా

- మున్సిపల్ ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల
- రేపటి నుంచే నామినేషన్ల స్వీకరణ
- 30వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ
- 31న నామినేషన్ల పరిశీలన.. 3వ తేదీ ఉపసంహరణ గడువు
- 11న పోలింగ్.. 13న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- వివరాలు వెల్లడించిన ఎస్ఈసీ రాణికుముదిని
- అమల్లోకి వచ్చిన ఎలక్షన్ కోడ్
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 మున్సిపాలిటీలు




**అక్షరదర్బార్, హైదరాబాద్**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. పదవీ కాలం ముగిసిన మున్సిపాలిటీలతో పాటు కొత్తగా ఏర్పడిన పురపాలక సంఘాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ రాణి కుముదిని వివరాలు వెల్లడించారు. నోటిఫికేషన్ విడుదలైన మరుక్షణం నుంచే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలవుతుందని స్పష్టం చేశారు. బుధవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. రిటర్నింగ్ అధికారులు వార్డుల వారీగా రిజర్వేషన్ల వివరాలతో కూడిన ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. ఇదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను కూడా అదే రోజు ప్రదర్శిస్తారు. నామినేషన్లు దాఖలు చేయడానికి జనవరి 30వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు గడువు ఉంటుంది.

### - ఎన్నికల ప్రక్రియ ఇలా..


దాఖలైన నామినేషన్ల పరిశీలన జనవరి 31వ తేదీ శనివారం ఉదయం 11.00 గంటల నుంచి చేపడతారు. పరిశీలన పూర్తయిన వెంటనే అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. నామినేషన్ తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఫిబ్రవరి 1వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు అప్పీల్ చేసుకోవచ్చు. ఈ అప్పీళ్లను ఫిబ్రవరి 2వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు పరిష్కరిస్తారు. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు సమయం ఇచ్చారు. ఉపసంహరణ గడువు ముగిశాక పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 11వ తేదీ బుధవారం జరుగుతుంది. ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఒకవేళ ఎక్కడైనా రీ– పోలింగ్ అవసరమైతే ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13వ తేదీ శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి మొదలవుతుంది. లెక్కింపు పూర్తయిన వెంటనే ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తారు. నోటిఫికేషన్ విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మున్సిపాలిటీల వారీగా వార్డుల సంఖ్యను కూడా కమిషన్ వెల్లడించింది. జిల్లా కలెక్టర్లు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కమిషన్ ఆదేశించింది.

### - ఉమ్మడి జిల్లాలో 12 మున్సిపాలిటీలు

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటనతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో ఎన్నికల కోలాహలం మొదలుకానున్నది. జనగామ మున్సిపాలిటీలో 30 వార్డులు, స్టేషన్ ఘన్‌పూర్‌లో 18 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వరంగల్ జిల్లా విషయానికి వస్తే నర్సంపేటలో 30 వార్డులు, వర్ధన్నపేటలో 12 వార్డులకు పోలింగ్ జరగనుంది. హనుమకొండ జిల్లాలోని పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా మహబూబాబాద్ మున్సిపాలిటీకి 36 వార్డులు ఉండగా, డోర్నకల్‌లో15 వార్డులు, కేసముద్రంలో 16, మరిపెడలో 15, తొర్రూరు 16 వార్డులకు పోలింగ్ జరుగనుంది. భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది.

# వైద్యురాలిని కబళించిన మృత్యువు

- తల్లి కడుపులోనే చిదిగిపోయిన ప్రాణం
- అతివేగంతో ఢీకొన్న లారీ.. హంటర్ రోడ్డులో విషాదం



అక్షరదర్బార్, హనుమకొండ : హన్మకొండ–వరంగల్ ప్రధాన రహదారి అయిన హంటర్ రోడ్డులో సోమవారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన లారీ ఒక నిండు గర్భిణీ ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ ఘటనలో కొలంబియా ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మమత (33) అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. హన్మకొండలోని కొలంబియా ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మమత తొమ్మిది నెలల గర్భిణీ. సోమవారం రాత్రి తన విధి నిర్వహణ ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. హంటర్ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒక లారీ ఆమె వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డాక్టర్ మమత తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి ఆమెను ఆస్పత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ ఆమె కన్నుమూశారు. పుట్టబోయే బిడ్డతో సహా తల్లి మరణించడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### - కుటుంబంలో తీవ్ర విషాదం

డెలివరీకి మరికొద్ది రోజులే సమయం ఉండటంతో ఆ కుటుంబంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. అంతలోనే జరిగిన ఈ ఘోర ప్రమాదం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. విషయం తెలిసిన వెంటనే ఆమె కుటుంబ సభ్యులు, తోటి వైద్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీ అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.

# కేసీఆర్ ను సంతోష్ రావే ప్రజలకు దూరం చేశారు!

- కేసీఆర్ వద్ద ఉన్న మొదటి దెయ్యం ఆయనే
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నమ్మకమైన గూఢచారి కూడా
- గద్దర్ ను సైతం ప్రగతిభవన్ ఎదుట నిలబెట్టిందీ సంతోష్ రావే
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన ఆరోపణలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : ఫోన్‌ట్యాపింగ్ కేసులో మాజీ ఎంపీ సంతోష్ రావు సిట్ విచారణకు హాజరైన సందర్భంగా మంగళవారం జాగృతి అధ్యక్షురాలు కవిత ఆయనపై సంచలన ఆరోపణలు చేశారు. మంగళవారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉద్యమ నాయకుడు, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌ను దూరం చేసింది సంతోష్ రావేనని విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దగ్గరున్న 'మొదటి దెయ్యం' ఆయనేనని, గద్దర్ లాంటి గొప్ప నాయకులు ప్రగతి భవన్ గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే అది ఆయన కుట్రల వల్లేనని మండిపడ్డారు. ఈటల రాజేందర్ వంటి వారు పార్టీ వీడటానికి కూడా సంతోష్ రావు వ్యవహారశైలే కారణమని ఆమె తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంతోష్ రావు ఒక 'గూఢచారి'గా పనిచేస్తున్నారని కవిత విమర్శించారు. కేసీఆర్ వ్యక్తిగత విషయాలను, ఫామ్ హౌస్‌లో ఏం జరుగుతుందనే సమాచారాన్ని ఆయన రేవంత్ రెడ్డికి చేరవేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన గూఢచారిని కాపాడుకుంటారని, అందుకే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సంతోష్ రావుకు శిక్ష పడుతుందన్న నమ్మకం తనకు లేదని ఆమె వ్యాఖ్యానించారు. సంతోష్ రావుకు మద్దతుగా ట్వీట్లు చేస్తున్న బీఆర్ఎస్ నేతల తీరును క్యాడర్ గమనించాలని ఆమె సూచించారు.



# అస్తమించిన 'కలం' యోధుడు

### - జర్నలిస్ట్ గోవుల జగదీశ్వర్ మృతి



అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి: సీనియర్ జర్నలిస్ట్ గోగుల జగదీశ్వర్ అనారోగ్య కారణాలతో మంగళవారం తుది శ్వాస విడిచారు. మొగుళ్ళపల్లి తొలి పాత్రికేయుడు మొగుళ్లపల్లి మండల టీయుడబ్ల్యూజే అధ్యక్షుడు గోగుల జగదీశ్వర్ మృతి వార్త ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో జర్నలిస్టులకు తీరని లోటుగా మారింది. 40 సంవత్సరాలు ఆంధ్రప్రభ దినపత్రికలో పని చేశారు. సుదీర్ఘకాలం జర్నలిస్టుగా ఎన్నో సామాజిక సమకాలీన అంశాలను ప్రజలకు చేరవేస్తూ విశేష ఆదరణ పొందిన జర్నలిస్టుగా గుర్తింపు పొందారు. ఎన్నో అవార్డులు ఆయన సొంతం చేసుకున్నారు. సంవత్సర క్రితం అనారోగ్యం బారిన పడిన ఆయన చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు జర్నలిస్టు నాగరాజు, కుమార్తె నాగరాణి ఉన్నారు. జగదీశ్వర్ అంతక్రియలు బుధవారం జరగనున్నాయని బంధువులు తెలిపారు,




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915